# ప్రేమశిక్ష

◆ గొరుసు జగదీశ్వరరెడ్డి ◆

**'ప్రేమ లేని జీవితం మరణంతో సమానం' అని ఎవరన్నారోగానీ, నా అనుభవాన్ని మననం చేసుకుంటే మాత్రం ఆ సూక్తి శుద్ధ అబద్ధం అన్పిస్తుంది.**

ప్రేమ గుడ్డిది... క్షణికానందాలకై ఈ మనుషులు సృష్టించుకున్న తెరచాటు పదంలా తోస్తుంది నాకు.

హైదరాబాద్ వదిలి నెలరోజులు కావస్తుంది. మనసంతా అవమాన భారంతో, అంతుతెలీని వేదనతో భగ్గుమంటోంది. మనిషికి మనసనేది లేకుండా, కేవలం మరమనుషుల్లా కృత్రిమంగా పన్జేసుకుపోతే ఎంత బావుణ్ణు.

భారతితో పరిచయం, ఆ పరిచయం స్నేహంగా మారటం, చివరికి ప్రేమో, మోహమో తెలీని ఆకర్షణలోకి లాగటం... అలా అనుకోని తిమిరంగా నా జీవితం మారి... ఇలా నన్నీ దట్టమైన కారడవుల్లోకి విసిరేసింది. ఒక్కసారిగా నా చుట్టూ ఉన్న పరిసరాల్ని పరికించాను. గుండెల్లోంచి దుఃఖం తన్నుకొచ్చింది. ఎటుచూసినా... దట్టమైన అడవి... నల్లమల్ల కొండలు... పగలే చీకట్లు ముసుకునే దట్టమైన పొదలు, రాత్రయ్యేసరికి ఫలానా పల్లెలో పులి ఎవర్నో చంపిందన్న వార్త... బితుకు బితుకుమంటూ... ఇలా ఈ క్రూరమృగాల మధ్యన నెలరోజులుగా జీవనం సాగిస్తున్నాను.

భారతితో నా ప్రేమ... కాదు కాదు వ్యామోహం ఇలా ఈడ్చి విసిరికొడ్తుందని కలలోనైనా ఊహించలేదు.

చదువయిన వెంటనే బ్యాంక్ పరీక్షలు గట్రా రాయటం అలవాటు చేసుకున్న నాపై ఏ అదృష్టదేవతో కరుణ చూపించగా, ఓ బ్యాంక్‌లో ఉద్యోగం వచ్చేసింది. మాతృగడ్డ వదిలి, జననీజనకులకు నా భారాన్ని తగ్గిస్తూ... డ్యూటీలో జాయిన్ అయ్యాను.

మా ఊరివాడే అయిన నా చిన్ననాటి మిత్రుడు మధు కూడా అనుకోకుండా అదే బ్యాంక్‌లో ఉన్నట్లు తెలిసి సంతోషించాను. వాడి రూమ్‌లోనే నన్నూ ఉండమన్నాడు... ఇంటి అద్దె ఫిఫ్టీ ఫిఫ్టీ చేసుకుందాం అన్నాడు. ఆ ఇల్లు సంజీవరెడ్డినగర్‌లో ఉండేది. మా బ్యాంక్‌కి దగ్గరలోనూ ఉండేది. అది మొత్తం నాలుగు పోర్షన్ల డాబా ఇల్లు.

కాలేజీ వదిలి అప్పటికి... ఎక్కువ రోజులు కానందున... ఆ చిలిపిదనం నన్నింకా వదల్లేదు. కాలేజీ గర్ల్‌ఫ్రెండ్ సుజాత అప్పుడప్పుడూ గుర్తొచ్చినా... ఆమెతో గడిపిన మధురక్షణాల్ని నెమరువేసుకుంటూ, ఏవో లోకాల్లో విహరించేవాడిని.

◆◆◆

**భారతితో పరిచయం స్నేహంగా మారి అది ప్రేమో, మోహమో తెలీని ఆకర్షణగా ఉంది.**

◆◆◆

భారతి నా జీవితంలోకి ప్రవేశించి, ఆ జ్ఞాపకాల తడిని తుడిచేసి, తన ప్రేమ ప్రవాహంలో ముంచేసింది.

మా ప్రక్క వాటాలోనిదే భారతి. భారతికి ఇద్దరబ్బాయిలు... చిన్న పిల్లలు. ఆమె భర్త సనత్‌నగర్ ఇండస్ట్రియల్‌లో ఓ ప్రైవేట్ ఫర్మ్‌లో ఉద్యోగం చేసేవాడు. భారతికి చిన్నతనంలోనే పెళ్ళయ్యిందట. వెంటవెంటనే ఇద్దరు పిల్లలు పుట్టటంతో కాస్తంత లావయినా అందం మాత్రం చెక్కుచెదరలేదు.

పసిమిఛాయతో, ఏ గొప్ప చిత్రకారుడో చేసిన అద్భుత చిత్ర సుందరిని గుర్తుచేసేది ఆమె. అప్పుడప్పుడూ శ్రమ భారంగా, ఏదో పోగొట్టుకున్నట్లుగా కూడా అన్పించేది ఆమెను చూస్తుంటే.

ఒకరోజు ఆరోగ్యం సరిగ్గాలేక బ్యాంక్‌కి వెళ్ళలేకపోయాను. నీరసంగా పడుకొని ఉన్న నాకు తలుపెవరో తట్టిన అలికిడికి మెలుకువ వచ్చింది. తలుపు తీసాను వెళ్ళి. ఎదురుగా భారతి. అంతవరకూ ఎక్కువగా పరిచయంలేని నేను ఒక్కసారిగా తడబడ్డాను. నోటంట మాట రాలేదు. తనే ముందుగా తేరుకుని చిన్నగా నవ్వింది.

"మీకు ఒంట్లో బాగులేదని, "అంకుల్ మూల్గుతున్నాడమ్మా" అని మా బాబు చెబితేను... ఏమయిందోనని కంగారుగా..." మాటల్ని పొందికగా స్పష్టంగా ఉచ్చరించే భారతి ఆగి, "లోపలికి రావచ్చా" అని అడిగింది.

"రండి... రండి" తడబడుతూ అన్నాను.

"అన్నట్లు మర్చాను. పాలు తెస్తాను" అంటూ నేనెంత వారిస్తున్నా వినకుండా వెళ్ళి తెచ్చింది.

మొహమాటంతోనే తీసుకున్నాను. అలా వచ్చిన జ్వరం నాతో మరో రెండు, మూడు రోజులు ఆడుకొని మెల్లగా వెళ్ళిపోయింది. ఆ మూడు రోజులూ భారతి ఉపచర్యలు... అలా ఆమెతో చనువుకు దారితీసాయి.

విచిత్రంగా ఆ చనువు కొన్నాళ్ళకి ప్రేమగా మారుతుందని కలలో కూడా ఊహించలేదు నేను. సమయం దొరికితే చాలు భారతితో మాట్లాడాలని అభిలషించేవాడిని. మధుకి సాహిత్య అభిలాష మెండు. వాడి షెల్ఫ్‌లో చాలా పుస్తకాలు ఉండేవి. పెద్ద పెద్ద రచయితలెందరో రాసినవి... అన్నీ చదివి భావుకతకి లోనయ్యే మధును చూస్తే ఒళ్ళు మండేది. 'ఆ పుస్తకాల్లో ఏముంటుందో' అన్పించేది. ఆ పుస్తకాల్లోంచి అప్పుడప్పుడూ ఒక్కో పుస్తకాన్ని భారతికి చదవటానికి ఇచ్చేవాణ్ణి.

**సమయం దొరికితే చాలు, భారతితో మాట్లాడాలని అభిలాషించేవాణ్ణి.**

ఆ రోజు నాకింకా బాగు గుర్తు. మా కొలీగ్ ఒకడికి యాక్సిడెంట్ అయ్యిందని విని, వాడ్ని పరామర్శిద్దామని ఆర్థోపెడిక్ హాస్పటల్‌కి వెళ్ళాను. అనుకోకుండా అక్కడ భారతి కన్పించింది. తన దూరపు బంధువుకి జబ్బు చేసిందని అంచేత పలకరించిపోదామని వచ్చానంటూ చెప్పింది.

ఇద్దరం అలా కారిడార్లో మాట్లాడ్తూ ఎంతో సేపు నిలబడిపోయాం. దూరంగా మెరిసిపోతూ



విలాసమందిరాల్లో నేనే రాజాధిరాజుని అన్నట్లుగా కృష్ణాఒబెరాయ్ కన్పిస్తోంది.

"మనం ఎక్కడయినా కలవాలి. మీకు వీలవుతుందా..." అనుకోని మాట భారతి నోటి నుండి వచ్చేసరికి ఉలిక్కిపడి హోటల్‌పై నుండి దృష్టి మరల్చాను.

నా సమాధానం ఎలా చెప్పాలో తెలీలేదు.

"మోహన్.... జీవితంలో ఎందరో వ్యక్తులు తారసిల్లుతుంటారు. ఐనా కొందరితో ఏ పూర్వజన్మ అనుబంధమో ఉన్నట్లుగా ఉంటుంది. మిమ్మల్ని చూసిన రోజు నుండీ... ఏదో రకమైన భావం ఏర్పడింది. మీరు నన్ను ఎలా అనుకున్నా ఫర్వాలేదు. నేను వివాహితనే కావచ్చు... కానీ నాలోని వెలితి... ఎలా... ఎలా చెప్పను" నాతో వచ్చిన నా మరో కొలీగ్ మా దగ్గరగా వచ్చేసరికి ఆమె ఆపేసింది చెప్పటం.

అదే రోజు సాయంకాలం డాబామీద పచార్లు చేస్తున్నాను. సంధ్యా సమయాన్ని చూస్తూ ఆనందించేవాణ్ణి. అప్పుడప్పుడూ రోజురోజుకీ పుట్టగొడుగుల్లా లేచిపోతున్న హర్మ్యాల మధ్యన... దూరంగా గుట్టల మీద కన్పించే అన్నపూర్ణ స్టూడియోను చూస్తున్న నేను భారతి వెనక నుండి రావటం గమనించలేదు.

నేనిచ్చిన మధు నవలని తీసుకొని వచ్చింది. ఆ నవల గురించి కొంత చెప్పింది. అయినా వినే స్థితిలో లేను.

"హాస్పటల్లో ఏదో చెబుతూ... ఆపేసారు" అన్నాను. ఏదో చెప్పబోతున్న భారతి క్రింద నుండి 'మమ్మీ' అంటూ వాళ్ళబ్బాయి పిలుపుకి కంగారుగా వెళ్తూ... పుస్తకం విప్పి చూడండి అంటూ సైగ చేసింది.

అప్పుడు చూసాను ఆ పుస్తకం వైపుకి. అది చలం రాసిన మైదానం నవల. చేత్తో పేజీలు తిరగేసాను. నీలిరంగులోని ఓ కాగితం మడతబెట్టి ఉంది మధ్యలో. తీసి విప్పి చదవబోతున్న నా చేతివేళ్ళు ఒక్కసారిగా కంపించాయి.

"మోహన్... వచ్చే ఆదివారం గండిపేట వెళ్దాము. మా వారు ఆఫీసు పనిమీద బొంబాయి వెళ్తారు. పిల్లల్ని వాళ్ళ స్కూల్లో వాళ్ళు ఎక్స్‌కర్షన్

## 'విలన్ కొడుకని పిలుస్తున్నారు'

'నానాపటేకర్' కొడుకుని స్కూల్లో అంతా విలన్ కొడుకని పిలుస్తుండటం చేత'నానా' తన ధోరణిని మార్చుకోవాలని నిర్ణయించుకున్నాడట. యన్.ఎఫ్.డి.సి. వారు నిర్మిస్తున్న పిల్లల చిత్రంలో పాజిటివ్ కారెక్టర్ చెయ్యాలని నిర్ణయించుకొన్నాడట. అది చూసైనా పిల్లలు తన కొడుకుని మంచిగా పిలుస్తారేమో చూడాలి!



కి తీసుకెళ్తున్నారు ఆ రోజు. మీరు మెహిదీ పట్నం బస్‌స్టాప్‌లో ఉండగలరు. నేను అక్కడికి వస్తాను. ఆ తర్వాత ఇద్దరం కలిసి వెళ్ళవచ్చు. మీతో చాలా మాట్లాడాలి ప్రేమతో భారతి."

ఒకటికి రెండుసార్లు చదివాను మళ్ళీ మళ్ళీ. మనసు తీయగా మూల్గింది. ఏవో కోర్కెలు... నన్ను ఎక్కడికో తీసుకెళ్తున్నాయి.

నా స్వప్న జగత్తులో కాలేజీ సుజాత అదృశ్యమై పోయింది, ఇప్పుడు భారతికి స్థానం కల్పించబడింది.

అనుకున్న ప్రకారం ఆదివారం రావటం, భారతి, నేను గండిపేట వెళ్ళటం అదొక మహత్తరమైన అనుభూతి. చిన్నతనంలో పెళ్ళయినా... యాంత్రికంగా దాంపత్యం అనుభవిస్తున్న తనకు, భర్త నుండి ప్రేమ, అనురాగం అందటం... గగనమనీ, కేవలం పిల్లలకోసమే ఈ జీవితాన్ని సాగిస్తున్నాననీ... తనలోని వెలితి నా నుండి పూర్తిగా తీరిందనీ, ఇలా... నాకెన్నో విషయాల్ని చెబుతూ అమరసుఖం అందించిన భారతిని ఎక్కడకయినా తీసుకెళ్ళిపోదామనిపించేది. ఇద్దరం ఈ జనారణ్యం వదిలి, ఏ అడవుల్లోకో వెళ్ళి, ప్రేమతో ... ఒకరిలో ఒకరం ఐక్యం అవుతూ జీవించాలనిపించేది.

అనుకోకుండా ఓ రోజు మధు షెల్ఫ్‌లోంచి 'అన్నాకెరినీనా' నవల టాల్‌స్టాయ్ రాసింది తీసి చదివాను. చదువుతున్నంతసేపూ... గుండె వేగంగా కొట్టుకునేది. అన్నాకు భర్త పిల్లలు ఉన్నా, పరపురుషుడి ప్రేమలో పడి, అందర్నీ వదులుకుని, సమాజానికి దూరమై, ప్రియునితో వెళ్తుంది. అన్నా జీవితం చివరికి రైలు చక్రాల క్రింద అంతం అవుతుంది. సమాజం తనని పురుగులా చూసినా... ప్రేమ మత్తులో మునిగిన అన్నాకి ఏదీ గుర్తు రాదు. అన్నా స్థానంలో భారతిని ఊహించుకున్నాను.

శరీరం ఒక్కసారిగా కంపించింది.

భారతి... జీవితం అలాకారాదు... తన భర్త కోసం ఎప్పుడూ తలవని భారతి నా రాకకై కళ్ళల్లో వత్తులు వేసుకొని నిరీక్షించేది.

ఆ ప్రేమలో నేను పూర్తిగా అంధుడినయ్యాను.

ఆ వేళ... మధు ఊర్లో లేడు... భారతితో మనసు విప్పి మాట్లాడాలని అన్పించింది. మా ప్రేమ విషయాన్ని ఏదో కొలిక్కి తెద్దాం అనుకున్నాను.

రాత్రి పది దాటింది. డాబా మీదికి వెళ్ళాను. నేను వెళ్ళేసరికి భారతి శూన్యంలోకి చూస్తూ, ఏదో ఆలోచిస్తోంది. మెల్లగా వెళ్ళి భారతి నడుమును నా మునివేళ్ళతో స్పృశించాను. ఉలిక్కిపడిన భారతి వెనక్కి తిరిగింది భయంగా. నా మొబుకాన్ని ఆమె భుజంపై నొక్కిపట్టి, చెవిలో గుసగుసగా "ఏం ఆలోచిస్తున్నావ్ భారతి" అన్నాను.

ఏం చెప్పలేదు భారతి. నక్షత్రాల కాంతిలో ఆమె కళ్ళు తడిగా ఉండటం గమనించాను. ఒక్కసారిగా కరిగిపోయాను. తనని నా వైపుకి త్రిప్పుకుని నడుంచుట్టూ చేయివేసి, మరో చేత్తో ఆమె మొబుకాన్ని పట్టుకొని కళ్ళతోనే... కారణం చెప్పమన్నట్టు చూసాను ఆర్తిగా.

◆ ◆ ◆

**నెలరోజులు గడువిస్తున్నాను. ఈ లోగా హైదరాబాద్ వదలకపోతే నీ శవం హుస్సేన్ సాగర్‌లో తేలుతుంది.**

◆ ◆ ◆

"మోహన్... నన్నెక్కడికయినా తీసుకెళ్ళిపో" ఒక్కసారిగా చిన్నపిల్లలా బావురుమంది. తనని ఎలా ఊరడించాలో తెలీలేదు. రెండు చేతుల్తో కళ్ళు తుడుస్తూ, "వద్దు..." అన్నట్లుగా ఆమె పెదాల మీద ముద్దాడాను. కంటి నీరు పెదాల మీదికి వచ్చింది... నోరంతా ఉప్పగా అన్పించింది.

ఏదో తమకంలో ఇద్దరం అలా ఉండిపోయాము.

"భారతీ" పిలుపు కాదు... ఘర్జనే.

ఉలిక్కిపడిన భారతి నన్ను దాదాపుగా తోసేసి, మెరుపులా మాయం అయ్యింది.

సెకండ్ షిఫ్ట్ నుండి తిరిగొచ్చిన ఆమె భర్తదా పిలుపు.

"కొంపదీసి మమ్మల్ని చూసి... క్రిందనుండి అలా ఘర్జించలేదు కదా..." అన్న అనుమానం వేసింది. ఆ వెంటనే అంత చల్లదనంలోనూ ముచ్చెమటలు పోసాయి. 'భారతి'ని ఏమంటాడో... అన్న శంక. మెల్లగా క్రిందికి వచ్చాను. ఎప్పుడొచ్చాడో మధు పడుకొని వున్నాడు గదిలో.

అన్యమనస్కంగా ఉన్న నాకు ఆ వేళ పోస్ట్‌మాన్ ఓ ఉత్తరం ఇచ్చి వెళ్ళాడు. ఎక్కడ్నుంచో... అనుకుంటూ ఫ్రమ్ అడ్రస్ లేని ఆ ఉత్తరాన్ని అనుమానంగా విప్పి చదవబోయి షాక్ తిన్నాను.

"సమాజంలో నీలాంటి చీడపురుగులు ఉండబట్టే... ఎన్నో సంసారాలు కూలిపోతున్నాయి. నీ కామం తీర్చుకోడానికి పెళ్ళయిన ఆడదే కావలసి వచ్చిందట్రా రాస్కెల్. భర్త అన్ని విధాల సుఖాన్ని అందించినా, ఏదో వెలితితో వెంపర్లాడే లాంటి స్త్రీల కోవలోదే భారతి. అదే అదనుగా ఆమెను నీ ప్రేమమత్తులోకి జార్చావు. ఒక్క నెల రోజులు గడువు ఇస్తున్నాను. ఈ లోగా నీవు హైదరాబాద్ వదిలి వెళ్ళకపోతే... నీ శవం హుస్సేన్‌సాగర్‌లో తేలటం ఖాయం. ఉద్యోగం వదిలేస్తావో... బదిలీయే చేయించుకుంటావో నీ ఇష్టం... బుద్ధిగా బతుకు. ఇది నీకు జీవితంలో నేనందించే మరణ శాసనం— ఆకాశరామన్న."

## 'నీ భార్యకు మరో మగాడితో అక్రమ సంబంధం ఉందని తెలిస్తే నీ గుండె బ్రద్దలవదా?'

ఉత్తరం సాంతం చదివిన నేను ఒక్కసారిగా కూలబడిపోయాను. కాళ్ళు రెండూ... వణుకుతూ, గుండె వేగం హెచ్చింది. భారతి ప్రేమలో మునిగిపోయిన నాలోకి పిరికితనం, చావు భయం చోటుచేసుకోసాగింది.

ఆ రోజు నుండి దాదాపు భారతిని తప్పించుకుని తిరగసాగాను. పిచ్చెత్తినట్లు 'ఏంచేయాలి' అన్న ఆలోచనల్తో సతమతమయ్యాను. అదే సమయంలో మా బ్యాంక్ వారు కొత్తగా ఎక్కడో బ్రాంచ్ పెట్టబోతున్నారని తెలిసింది.

“బతికుంటే బలుసాకయినా తిని బ్రతకొచ్చు” అన్న సామెతగా మా ఆఫీసర్ కాళ్ళావేళ్ళాపడి బదిలీకై ప్రార్థించాను.

నా బ్రతుకు తీపి నన్ను ఇంతగా దిగజార్చుతుందని ఊహించలేదు. చివరికి ఆ బ్రాంచ్ ఆఫీసెక్కడో తెలిసాక నీరుకారిపోయాను. శ్రీశైలం దగ్గర్లో నల్లమల్ల అడవుల్లో ఓ మోస్తరు ఊర్లో అట.

అయినా... తప్పలేదు. ఎవడో ఆకాశరామన్న చేతిలో చచ్చేకన్నా ఆ అడవుల్లోకి వెళ్ళి ఏ పులినోట్లోనో పడ్డం మంచిదని అనుకున్నాను.

ఈ విషయాన్ని ఎప్పుడూ మధుతో చర్చించలేదు. అనుకోకుండా నా బదిలీ విషయం మధును కూడా ఆశ్చర్యంలో ముంచేసి ఉంటుందనుకున్నాను.

భారతితో చెప్పకుండానే వెళ్ళాలి... నా ఎదురుగా మృత్యుదేవత ఉన్నట్లుగా భయం చెందాను. దాదాపు ఆమె జ్ఞాపకాల్ని నా చావు భయం తుడిచేసిందనే చెప్పాలి. అలా ఆకాశరామన్న తంతే ఎగిరొచ్చి నల్లమల్ల అడవుల్లో పడ్డట్టు పడ్డాను.

కొత్త బ్రాంచ్‌కి వచ్చి వారం అయ్యాక నా పేర ఓ ఉత్తరం వచ్చింది. మరో ఆకాశరామన్న కాదుకదా అనుకున్న నాకు ఫ్రమ్ అడ్రస్‌లో మధు అని రాసి ఉండటంతో నిండుగా శ్వాసపీల్చుకొని ఉత్తరం విప్పాను.

డియర్ మోహన్,

నీ అంతరాత్మలో జరుగుతున్న అలజడికి కారకుడ్ని పరోక్షంగా నేనే అని తెలుసా! నీకు ఎలా చెప్పి మందలించాలో అర్థం కాని నేను ఆకాశరామన్నగా మారిపోయి, నిన్ను అనుకోని ఆవేదనకు గురిచేసినందుకు క్షమించు.

ప్రేమ జీవితానికి ముఖ్యమే... కాదనను. కానీ నీది వ్యామోహం. అప్పనంగా దొరికే శారీరక సుఖాన్ని హాయిగా అనుభవిద్దాం అనుకున్నావే గానీ, నీ చుట్టూ ఉన్న సమాజం గురించిగానీ, భారతి జీవితం ఏమవుతుందని గానీ... అసలు ఆమె వివాహిత అని గుర్తుంటే ఇలాంటి చర్యకి పూనుకోవు.

మీరిద్దరూ గండిపేటకి వెళ్ళిన విషయం భారతి భర్తకు తెలిసిన వారెవరో ఆయన్తో చెప్పారట. భారతితో ఆమె భర్త ఓ రోజు ఘర్షణ పడటం నాకు వినిపించింది. “ఇప్పటికైనా మించిపోయింది లేదు... మోహన్‌ని మర్చిపో... నీకు తెలీక ఏదో పొరపాటు చేసావు... నిన్ను క్షమిస్తున్నాను” అన్న మాటలకి 'అంత ఉత్తముడిని భారతి మోసం చేస్తుందా' అనిపించి, ఆమెపై చాలా కోపం వచ్చింది. ఆయన స్థానంలో మరొకడే వుంటే, భారతికి విడాకులు ఇస్తూ, నిన్ను చితకబాదేవాడు. అంతెందుకు ఆయన స్థానంలో నీవుంటే ఏం. చేసేవాడివి?

నీకూ పెళ్ళి అయ్యాక, నీ భార్య మరో మగాడితో అక్రమసంబంధం కల్గివుందని తెలిసిన వాడు నీ గుండె బ్రద్దలవదా?

అందుకని... ఇంకా ఈ నీ ప్రేమ విషయం సమాజంలో దావానలంలా వ్యాపించకుండా ఉండేందుకై... ఆకాశరామన్ననై నిన్నీ ఊరి నుండి పంపాను. కాలేజీ నుండి వెనువెంటనే జాబ్‌లోకి ప్రవేశించిన నీలో... ఈ సమాజం పట్ల సరి అయిన అవగాహన లేదు. చిలిపిగా... జీవితాల్తోనే ఆడుకోబోయావు. నీ చదువునీ, సంస్కారాన్నీ క్షణికమైన సుఖం కోసం తెరమరుగు పరిచావు.

ఇక నుండి... నీ వక్రబుద్ధిని మార్చుకొని, మరో భారతిని నీ జీవితంలోకి రానీయకు. త్వరలో పెళ్ళిచేసుకొని ఓ ఇంటివాడివవ్వాలని ఆశీర్వదిస్తూ.

నీ మధు.

ఉత్తరం సాంతం చదివిన నేను స్తంభించిపోయాను. నా తప్పు ఎంత ఘోరమైందో... మెల్లిగా తెల్సివచ్చింది. అంతవరకూ నాలోని చెడుకే చేయూతనిచ్చిన నా ఇంగితం నా ఎదురుగా ఉండి... “నీ సంస్కారం ఎంత హీనమయ్యిందీ... సిగ్గుగా లేదూ...” అంటూ చీవాట్లు పెట్టినట్లుగా అనిపించింది.

నా వైపుకి గురిచూసి వస్తున్న విషబాణాల బారి నుండి నన్ను తప్పించి, నాకో పలాయన మార్గం చూపించిన మధుకి మనసులోనే అంజలి ఘటించాను.

నాలో అంతవరకూ ఉన్న అలజడి క్రమేపీ తగ్గింది. మనసు ప్రశాంతంగా ఉంది. మారిన మనసుతో నన్ను రక్షించిన మధుకి కృతజ్ఞతతో ఉత్తరం రాయాలని కలాన్ని, కాగితాన్ని నా చేతిలోకి తీసుకున్నాను.



## 'జూహీ' పోస్టర్ దొంగతనం

ఈనాడు 'జూహీ చావ్లా' ఎంతో మందికి ప్రియమైన నటిగా మారిపోయింది. అన్ని వర్గాల వాళ్ళు ఆమె అందానికి ముగ్ధులైపోతున్నారు. ఒక పాన్ దుకాణం దగ్గర అంటించిన 'సాజన్ కా ఘర్' చిత్రాన్ని చూసి వెర్రెత్తిపోయి, ఎవరో ఆ పోస్టర్‌ని దొంగతనంగా చింపుకుపోయారట! ఆ వెర్రి ముదిరితే జూహీనే ఎత్తుకుపోతారేమో! ఆమె జాగ్రత్తగా వుండటం మంచిది. ఆడదాని అందం మీద మోజు ఎంతకైనా తెగింపజేస్తుంది!